క్లుప్తంగా

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి


రామచంద్రన్(ఫైల్)

నాగలాపురం : మండలంలోని వినోభానగర్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు తిరువళ్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నాగలాపురం తూర్పు హరిజనవాడకు చెందిన ఎంజీ రామచంద్రన్ (68) మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ హనీఫ్ తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడు..


వెంకటేష్ (ఫైల్)

నాగలాపురం:మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఈ నెల 14వ తేదీన ఆత్మహత్యకు యత్నించిన వెంకటేష్ (28) చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కోలుకుంటున్న శిశువు

తిరుపతి తుడా: పలమనేరు మండల పరిధిలోని బాలిక నవజాతి శిశువుకు జన్మనిచ్చి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ శిశువుకు తిరుపతి రుయా ఆసుపత్రి చిన్నపిల్లల విభాగంలోని ఎన్ఐసీయూలో వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. తొలి రెండు రోజులు చిన్నారి ఆరోగ్యం కుదుటపడడం కష్టతరంగా ఉందని వైద్యులు భావించారు. నెలలు నిండకనే జన్మించడం, బరువు తక్కువగా ఉండడం వంటి కారణాలను గుర్తించారు. ప్రస్తుతం ఆరోగ్యం కొంత కుదుటపడుతోందని తెలిపారు.వెంటిలేటర్ సహాయాన్ని తొలగించి సీటాప్ మిషన్‌పై వైద్యం అందిస్తున్నారు.

సమయం లేదు మిత్రమా!

- పది పరీక్షలకు సన్నద్ధం
- వచ్చే 25 రోజులు చాలా కీలకం
- ముఖ్యమైన అంశాలపై పట్టు అవసరం



తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇక 24 రోజులు మాత్రమే సమయం ఉంది. పరీక్షలను ఎలా రాయాలి, మంచి మార్కులు సాధించేందుకు ఎలాంటి ప్రణాళికలు వేసుకోవాలి, ఏయే పాఠ్యాంశాలను రివిజన్ చేసుకోవాలి..? వంటి అంశాలపై ఆయా సబ్జెక్టు టీచర్ల సలహాలు, సూచనలను తీసుకోవాంటున్నారు నిపుణులు. ముఖ్యమైన అంశాలపై పట్టు బిగిస్తే పది పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణం సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు. అలాగే తెలుగులో దోషాలుండొద్దు.. హిందీలో 'నిబంధ్'పై పట్టుండాలి.. ఆంగ్లంలో ఎడిటింగ్ ముఖ్యం, 'జీవన' చిత్రాలపై తర్ఫీదు అవసరం, తికమక పడొద్దు'.. సూత్రాల 'లెక్క' తప్పొదు.. చరిత్ర తెలుసుకోవాలి.. అంటున్నారు ఆయా సబ్జెక్టు టీచర్లు.

సాంఘిక శాస్త్రం



1. మ్యాప్, టేబుళ్లు, గ్రాఫ్స్‌ను తర్ఫీదు చేయాలి.
2. ప్రపంచ పటంలో యూరోప్ ఖండానికి సంబంధించిన దేశాలు.. వాటి పేర్లు, దేశ చిత్రపటాలు, భారతదేశ పటంలో ఉన్న ముఖ్య నగరాలు, పీఠభూములు, నదులు, ఖనిజాలు ఉన్న ప్రాంతాల పేర్లు బాగా గుర్తు పెట్టుకోవాలి.
3. పేరాగ్రాఫ్ అంశంలో ఒక ప్రదేశానికి సంబంధించి ప్రశ్న ఇస్తారు.
4. పర్యావరణం, కాలుష్య నియంత్రణ, మ్యాప్స్, గ్రాఫ్స్, బార్ డయాగ్రామ్స్‌పై పట్టు సాధించాలి. **– ఎ.శంకర్‌రెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు**

భౌతిక శాస్త్రం



1. వ్యాసరూప ప్రశ్నలపై ఎక్కువ దృష్టి సారిస్తే ఉత్తమ మార్కులు సాధించవచ్చు. పటాలు గీయడం సాధన చేయాలి.
2.రంగుల ప్రపంచం, విద్యుత్తు, రసాయన చర్యలు, సమీకరణాలు, కార్బన్- వాటి సమ్మేళనాలు, విద్యుత్ ప్రవాహం.. అయస్కాంత ప్రభావాలు, లోహాలు, అలోహాలు అంశాల్లో నుంచి వ్యాసరూపాలను బాగా చదువుకోవాలి.
3. కాంతి-పరావర్తనం, వక్రీభవనం, ఆమ్లా - క్షారాలు, లవణాలు వంటి అంశాలపై పట్టు పెంచుకోవాలి.

– ఎస్.సౌజన్య, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని, జెడ్పీ హైస్కూల్, పిచ్చాటూరు

జీవశాస్త్రం



1.ప్రతి పాఠ్యాంశంలో ఉన్న ప్రయోగాలు, టేబుల్స్, ఫ్లోచార్ట్స్‌పై పట్టుండాలి. పటాలు గీయడం బాగా నేర్చుకోవాలి.
2. పర్యావరణానికి సంబంధించిన అంశాలను బాగా చదవాలి. స్లోగన్స్‌ను బాగా ప్రాక్టీసు చేయాలి.
3. టెన్ ఫామ్స్ కింద వైద్యులు - అవయవాల గురించి విశ్లేషణలను చదవాలి.
4. లైఫ్ ప్రాసెస్, కంట్రోల్ అండ్ కోఆర్డినేషన్ తదితర అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలొస్తాయి.

– టీ.రాజశేఖర్‌రెడ్డి, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు

తెలుగు



1. తెలుగులో దోషాలు లేకుండా సమాధానాలు రాస్తే 20 శాతం మార్కులు సులువుగా వస్తాయి. పద్య భాగంలో కవి పరిచయం, గద్యంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం అంశాలు, చందస్సులో వృత్త పద్యాలపై ప్రశ్నలొస్తాయి.
2. మారీచుడు, కైక, విశ్వామిత్రుడు, సుగ్రీవుడు, దశరథుడు, త్రిజట అంశాలతో పాటు రామాయణం, ప్రాశస్త్యం, సీతారామ కల్యాణం, సేతువు నిర్మాణం, సీతాన్వేషణ, వృత్తాంతం, సీతాపహరణం, వంటి అంశాలపై పట్టు సాధిస్తే అధిక మార్కులు సొంతం చేసుకోవచ్చు.

– డాక్టర్ సి.కుప్పయ్య, తెలుగు ఉపాధ్యాయుడు

ఇంగ్లిష్



1. ఎడిటింగ్, ప్యాసేజ్ అంశాలపై పట్టు సాధించాలి.
2. యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, రిపోర్టెట్ స్పీచ్ అంశాలను చదవాలి.
3. ఒకాబులరీ గ్రామర్‌కు టెక్స్ టూల్‌ను ఎక్కువగా సాధన చేయాలి.
4. రెయిమ్స్, స్కీమ్, ఫొనెటిక్స్‌ను చదివితే సులువుగా ప్రశ్నలకు జవాబులు రాయవచ్చు.

–డీ.జగదీష్ ప్రసాద్, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు

హిందీ



1. నిబంధ్ అంశంలోని పాఠ్యాంశాలు, సామాజిక అంశాలు, పర్యావరణ, తక్ నీతి అంశాలకు సంబంధించిన వాటిపై పట్టు సాధించాలి.
2. వ్యాకరణాంశాల్లో ఉపసర్గ్, క్రియ, సంఖ్య, తత్సమ్-తద్భవ్, ప్రత్యయ్, సంధి అంశాలు, గద్యాంశంలో డైరీ ఏక్ పన్నా పాఠం, తతారా వామీరో పాఠ్యాంశాలను అభ్యసనం చేయాలి.
3. పద్య భాగం నుంచి మనుష్యత, తోప్, కవి పరిచయాల్లో మీరా బాయి, కబీర్‌దాస్ అంశాలపై పట్టు అవసరం. **– రేగంటి దేవానంద్, హిందీ ఉపాధ్యాయుడు**

గణితం



1, ప్రతి పాఠంలోని సూత్రాలపై పట్టు సాధిస్తే పరీక్షలో వచ్చే ప్రశ్నలకు సులువుగా సమాధానాలు రాయొచ్చు. 1, 2, 3, 13, 14 పాఠ్యాంశాలు, 10, 11, 12 పాఠ్యాంశాల్లో ఉన్న ప్రశ్నలు వస్తాయి.
2. బహుపదులు, వృత్తాలు, త్రికోణమితీయ అనువర్తనాలు, ఉపరితల వైశాల్యాల్లో పటాలు గీయడంపై ప్రాక్టీసు చేయాలి.
3. త్రికోణమితీయ పట్టికలు, సర్వసమీకరణల ఉపరితల వైశాల్యాల పట్టికలపై సాధన అవసరం.

–ఎ.దామోదర్‌నాయుడు, గణిత ఉపాధ్యాయుడు

నేర నియంత్రణే లక్ష్యం

తిరుపతి క్రైమ్ : జిల్లాలో నేర నియంత్రణే లక్ష్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు నిర్వహించినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్పెషల్ పార్టీ పోలీసులు నిత్యం గస్తీ చేపట్టి రాత్రివేళ అనుమానాస్పదంగా సంచరిస్తున్న 706 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారికి ఆయా పోలీస్‌స్టేషన్లలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు వివరించారు. అలాగే 148 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 2,378 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులకు కోర్టు జరిమానా విధించిందని వెల్లడించారు. ఈ క్రమంలోనే 372 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. రోడ్లకు ఇరువైపులా ఆక్రమించి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న 1,597 మంది చిరువ్యాపారులపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు కట్టినట్లు వివరించారు.

'అన్వేషణ'కు ఎస్వీయూ బృందం


విదార్థినులను అభినందిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : బెంగళూరులోని రామయ్య వర్సిటీలో గురువారం నుంచి రెండు రోజుల పాటు అన్వేషణ–25 పేరుతో నిర్వహించనున్న 'శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణల అంతర్జాతీయ విద్యార్థుల పోటీలకు ఎస్వీయూ బృందం హాజరుకానుంది. వర్సిటీ కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ ఆధ్వర్యంలో సంజయ్ కుమార్, భవ్య శ్రీ, దీప్తి, జాస్మిన్‌లతో కూడినబృందం బుధవారం బెంగళూరుకు పయనమైంది. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ బృందానికి అభినందనలు తెలిపారు. పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ హరికృష్ణ, అధ్యాపకులు కుసుమ, శరత్ బాబు పాల్గొన్నారు.

ముగిసిన 'మహాకుంభ్'


మంత్రులు లోకేష్, సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు


తిరుపతి అర్బన్ : అంతర్జాతీయ ఆలయాల అనుసంధానమే లక్ష్యంగా తిరుపతిలో నిర్వహిస్తున్న మహాకుంభ్–2025 సదస్సు బుధవారంతో ముగిసింది. ఇంటర్నేషనల్ టెంపుల్ ఫెడరేషన్ చైర్మన్, మహారాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ ప్రసాద్ లాడ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక రాజధానిలో సదస్సు నిర్వహించడం దేవుని ఆశీస్సులుగా భావిస్తున్నట్లు తెలిపారు. అగ్రశ్రేణి మత పెద్దలు, విధాన నిర్ణేతలు, ఆలయ నిర్వాహకుల సమక్షంలో చారిత్రాత్మక అడుగు వేసినట్లు వెల్లడించారు. ఈ సదస్సు ఆలయ పరిపాలన, మతపరమైన పర్యాటకం మరియు ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణకు ప్రత్యేకించి టెంపుల్ కనెక్ట్‌కు దోహదపడుతుందని చెప్పారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ మట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన మతపరమైన స్వేచ్ఛలను వివరించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ శక్తివంతమైన ఆలోచన, భాగస్వామ్యతో సదస్సు చేపట్టారని తెలిపారు. దేవాలయాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్లోబల్ సమ్మేళనాన్ని తిరుపతిలో నిర్వహించడం సంతోషంగా ఉందని వెల్లడించారు. అనంతరం టెంపుల్ కనెక్ట్ అండ్ ఐటీసీ ఎక్స్‌పో వ్యవస్థాపకుడు గిరీష్ కులకర్ణి, చైర్మన్ సీతలను,దేవికూప్ మహాభద్రకాళి శక్తిపీఠం అధ్యక్షుడు సత్పాల్ శర్మాజీ, గురూజీ ప్రతిష్టాత్మక చండీ ముకుట్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా అవసరం


డైరీ ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ తదితరులు

తిరుపతి కల్చరల్ : ఉద్యోగులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా నిరంతరం ప్రజలకు సేవలు అందించే ఉద్యోగుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగు లక్షలకు పైగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు అందించాల్సి ఆర్థిక ప్రయోజనాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సర్వీస్ రూల్స్ వ్యవహారాల నియంత్రణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. వేతన సవరణ కోసం హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో త్రిసభ్య కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులపై ఒక ప్రణాళికతో ప్రకటన విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, జిల్లా అధ్యక్షుడు తులసీరామ్, కార్యదర్శి సుబ్బరాయుడు, కోశాధికారి ఎం.మధుబాబు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


అనర్జిత్ మృత దేహాన్ని పరిశీలిస్తున్న సీఐ చిన్నగోవిందు

తిరుపతి రూరల్ : మండలంలోని వెంకటపతి నగర్‌లో మంగళవారం రాత్రి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మహారాజ్ గంజ్ జిల్లా, భరత్ గడ్డ గ్రామానికి చెందిన అనర్జిత్ (28) గత 8 ఏళ్లుగా పెయింటింగ్ పనిచేసి జీవనం సాగించేవాడు. అతడికి ఇద్దరు భార్యలు, మొదటి భార్యకు ఒక కొడుకు. రెండో భార్య సోనాలికి రెండు నెలల కుమారుడు వున్నాడు. మొదటి భార్య యూపీలో ఉంది. రెండో భార్యతోకిసి అనర్జిత్ వెంకటపతి నగర్‌లోని అద్దె ఇంటిలో కాపురముంటున్నారు. మద్యానికి బానిసైన అనర్జిత్ తన రెండో భార్య సోనాలితో తరచుగా గొడవపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవపడి ఇంటి లోపల గడియ పెట్టుకున్నాడు. బుధవారం ఉదయం భర్త తలుపు తెరకపోవడంతో అనుమానం వచ్చిన సోనాలి తలుపు సందులో నుంచి చూడగా అనర్జిత్ ఫ్యానుకు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. రూరల్ సీఐ చిన్నగోవిందు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి తమ్ముడు రహ్మిట్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీణాపాణి విహారం


హంస వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీనివాసుడు


చిన్నశేషవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

- అంగరంగ వైభవంగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- చిన్నశేషవాహనంపై ఊరేగిన వేణుగోపాలకృష్ణుడు

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజైన బుధవారం ఉదయం స్వామి వారు వేణుగోపాల కృష్ణుడి అవతారంలో అయిదు తలల చిన్న శేషుడిపై ఆశీనులై నాలుగు మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం దేవదేవేరులకు వేడుకగా స్నపన తిరుమంజన జరిపించారు. సాయంత్రం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామి వారు వీణ ధరించి సరస్వతీ రూపంలో హంస వాహనంపై ఆశీనులై తిరుమాడవీధుల్లో విహరించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో టీటీడీ అధికారులు హిందూ ధర్మప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపట్టిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

చిట్టమూరు : మండలంలోని చిల్లమూరుకు చెందిన రాజయ్య (47) అనే వ్యక్తి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చిన్నబల రామయ్య బుధవారం తెలిపారు. మంగళవారం చిల్లమూరు క్రాస్ రోడ్డు వద్ద రెండు మోటర్ సైకిళ్లు ఢీ కొనడంతో షేక్ మస్తాన్ అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించగా, సుబ్రమణ్యం, రాజయ్య తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో రాజయ్య మృతి చెందగా పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కార్పొరేట్‌లకు కొమ్ముకాసే బడ్జెట్

తిరుపతి కల్చరల్ : ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్‌లకు కొమ్ముకాసే బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. బుధవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలను దగా చేస్తున్న మోదీ ప్రభుతానికి ఐక్య ఉద్యమాలతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.రైతులకు కనీస మద్దతు ధర కల్పించకపోవడం అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వ సంస్థలని ప్రైవేట్ పరం చేసి దేశాన్ని దివాలా చేసే పనిలో మోదీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను దేశ ప్రజలు, వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని వెల్లడించారు. 2014లో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ తన పార్టీ అజెండా పక్కనపెట్టి బీజేపీ అజెండా నెత్తిన పెట్టుకొని సనాతన వాదంతో తిరుగుతున్నారని మండిపడ్డారు. సీపీఐ నేతలు మురళి, చిన్నంపెంచలయ్య, రామానాయుడు, సీపీఎం నేతలు నాగరా జు, సుబ్రమణ్యం, జయంద్ర, సాయిలక్ష్మి, సీపీఐ ఎంఎల్ నేతలు హరికృష్ణ, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎస్వీయూ మహిళా హాస్టల్లో పాముల హల్‌చల్

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని మహిళా హాస్టల్లోకి బుధవారం రాత్రి రెండు పాములు ప్రవేశించాయి. దీంతో విద్యార్థినులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే హాస్టల్ అధికారులకు సమాచారం అందించారు. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో అర్ధరాత్రి విద్యార్థినులు హాస్టల్ వెలుపలకు వచ్చి ధర్నాకు దిగారు.

వినూత్న నిరసన



ఎస్వీ వెటర్నరీ వైద్య విద్యార్థులు బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. గౌరవ వేతనం పెంపు కోసం 17 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ఈ మేరకు వర్సిటీ మైదానంలో హైక్ స్టయిఫండ్ సింబల్ రూపంలో బైఠాయించారు. అనంతరం తిరుపతికి విచ్చేసిన కేంద్ర కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి చంద్రశేఖర్‌ను ఓ ప్రైవేట్ హోటల్‌లో కలిసి వినతి పత్రం అందించారు. – తిరుపతి సిటీ

ఫ్లెక్సీ పోరు.. ప్రజల బేజారు





తిరుపతిలో మంత్రి నారా లోకేష్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఒకరు పెట్టిన ఫ్లెక్సీలను మరొకరు తొలగించి తమ ఆధిపత్యం చాటుకునేందుకు యత్నించారు. గరుడ వారధి, నంది కూడలి తదితర ప్రాంతాల్లో పలు ఫ్లెక్సీలను రోడ్లపై విచ్చలవిడిగా పడేశారు. దీంతో పలువురు వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదానికి గురయ్యేవారమని నగరవాసులు మండిపడ్డారు.ఈ క్రమంలోనే కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్చిలకు సైతం అడ్డుగా ఫ్లెక్సీలు పెట్టడంపై ఆవేదన వ్యక్తం చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

క్లుప్తంగా

శివరాత్రి వేడుకలకు తరలిరండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి

తిరుపతి రూరల్: మండలంలో తిరుచానూరు పంచాయతీలోని వైష్ణవి విద్యాలయం పక్కన ఈనెల 26న నిర్వహించనున్న మహాశివరాత్రి వేడుకలకు భక్తులు తరలి రావాలని తిరుచానూరు పంచాయతీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఏకవీరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ పిలుపునిచ్చారు. బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



శివాజీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకుని తిరుపతి ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సీనియర్ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడారు. భారతదేశం గర్వించ దగ్గ మహావీరుడు ఛత్రపతి శివాజీ అని కీర్తించారు. సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, గురు ప్రసాద్, రెడ్డప్ప నాయుడు గురునాథ నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయండి

తిరుపతి సిటీ: తిరుపతిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడం శోచనీయమని, వాటిని ఏర్పాటు చేయాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై బుధవారం తిరుపతి పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్‌ను కలసి వినతి ప్రతం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీల సంఖ్య పెంచాలని, ఇవి లేకపోవడం వలన పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు గార్లపాటి శ్రీధర్, మల్చి ఉపేంద్ర, వెంకటేష్. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలి

భాకరాపేట : అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ఉపాధ్యాయులు బోధించాలని చిన్నగొట్టిగల్లు ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. బుధవారం చిన్నగొట్టిగల్లు జెడ్పీ హైస్కూల్లో శిక్షణా తరగతులను ఆయన సందర్శించి మాట్లాడారు. ఎంఈఓ2 గోపినాథ్, హెచ్‌ఎం మృదులాదేవి, డీఆర్‌పీలు శిరీష, భారతి, రెడ్డెప్పరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే నగరంలో రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న 45 మందికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి బుధవారం తీర్పు చెప్పారు.

మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ నేడు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్, సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నగర మేయర్ డాక్టర్ ఆర్ శిరీష అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఎస్వీ యూనివర్సిటీ సెట్ హాల్‌లో గురువారం ఉదయం 10 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభం కానుంది. శాన్ని నిర్వహిస్తారు.

ముగిసిన మేధావుల సదస్సు

తిరుపతి గాంధీ రోడ్డు: కేంద్ర బడ్జెట్ 2025–26పై బుధవారం తిరుపతిలోని ఓ హోటల్లో మేధావుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేంద్ర పౌర సంచార సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ ప్రత్యేకమైన బడ్జెట్ అని, ఈ భారీ బడ్జెట్ ప్రవేశపెట్టడమనేది కత్తి మీద సాము లాంటిదని, అలాంటిది ఒక తెలుగు మహిళ దీనిని ప్రవేశపెట్టడం గర్వంగా భావిస్తున్నామన్నారు. 8 కోట్ల మంది రైతులకు, మత్స్య కారులు, పాడిరైతులకు ఉపయోగ పడేలా బడ్జెట్ రూపొందించారని, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు, ఆశలను నెరవేర్చాలా ఉందని పేర్కొన్నారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను దేశప్రజలందరూ స్వాగతిస్తుంటే కొంతమంది మాత్రమే వ్యతిరేకిస్తున్నారని, ఇది సరికాదన్నారు.

మరింత నాణ్యమైన ఆహారం పెట్టండి

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసుపత్రిలో రోగులకు ఇచ్చే ఆహార పదార్థాలను మరింత రుచికరంగా మెనూ ప్రకారం పెట్టాలని సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ సుబ్బలక్ష్మమ్మ ఆదేశించారు. రోగులకు పెడుతున్న ఆహారాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. సాంబారు, కర్రీల రుచి చూసి ఉప్పు తక్కువగా ఉందని ఆమె గుర్తించారు.

మన పోరాటం.. రాష్ట్రానికే ఆదర్శం

- జగనన్నను సీఎంగా గెలిపించుకునేందుకు సైనికుల్లా పనిచేద్దాం
- తిరుపతి నగర కమిటీ ప్రమాణ స్వీకారంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి



తిరుపతి నగర కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: కూటమి నాయకుల అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమాలను ఎదుర్కొని నిలబడడంలో తిరుపతి వైఎస్సార్‌సీపీ నాయకుల పోరాట ప్రతిమ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. తిరుపతిలోని ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో బుధవారం భూమన అభినయ్‌రెడ్డి అధ్యక్షతన తిరుపతి నగర అధ్యక్షులుగా మల్లం రవిచంద్రారెడ్డితో పాటు నగర నూతన కమిటీ ప్రమాణస్వీకారాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎవరైనా ఉంటారని, అయితే అధికారంలో లేనప్పుడు కూడా ఇంతమంది పార్టీలో ఉంటూ భూమన కుటుంబం వెంట నడుస్తున్న ఆదరాభిమానాలు ఎప్పటికీ మరువలేమన్నారు. డిప్యూటి మేయర్ ఎన్నికలో కూటమి నాయకుల అరాచకాలను అడ్డుకునేందుకు ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీషతో పాటు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన పోరాట ప్రతిమ చెప్పలేనదన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిద్దామని కోరారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి నాయకులు గెలిచినా వారికి సంతోషం లేదన్నారు. అలాగే రాబోయే రోజుల్లో జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రతి ఒక్కరు జగనన్న సైనికుల్లా పనిచేద్దామని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి అరాచకాలపై ఎంపీ న్యాయ పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఇదలా ఉంచితే, టౌన్‌బ్యాంక్ అభివృద్ధికి ఆ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డితో పాటు పాలకవర్గం ఎంతో కృషి చేస్తోందన్నారు. గత పాలకవర్గంలోని రూ. 30కోట్ల మొండి బకాయిలను సైతం వసూలు చేశారని, అయితే చేసిన అభివృద్ధిని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టి పాలకవర్గంపై నిరాధార ఆరోపణలతో బురద చల్లుతోందని మండిపడ్డారు. తిరుపతి వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, కూటమి అరాచకాలను ఎండగడుతూ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామన్నారు. రానున్న రోజుల్లో జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు తమవంతు కృషి చేస్తానన్నారు. కేతం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ, జగనన్న తన పాలనలో ప్రజలకు ఎంతో మేలు చేస్తే కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిదని విమర్శించారు.

కూటమి దౌర్జన్యాలకు భయపడం

తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలకు భయపడే ప్రసక్తే లేదని పార్టీ నాయకులు బొమ్మగుంట రవి, దుద్దేల బాబు, నీలం బాలాజి, కట్టా గోపీయాదవ్, కార్పొరేటర్లు డాక్టర్ అనీష్‌రాయల్, తమ్ముడు గణేష్, నల్లాని బాబు, వాసుయాదవ్, గోపాల్‌రెడ్డి అన్నారు. పార్టీ నగర కమిటీ ప్రమాణస్వీకారంలో వీరు మాట్లాడారు. నిబద్ధత, క్రమశిక్షణకు మారుపేరైన భూమన కరుణాకరరెడ్డి నాయకత్వంలో తాము పనిచేస్తున్నందుకు ఎంతో గర్వపడుతున్నామన్నారు. కూటమి నాయకులు భయపెట్టాలని, బెదిరించాలని చూస్తే ఎంతకైనా నిలబడి పోరాడుతామని హెచ్చరించారు.



ప్రమాణ స్వీకారానికి హాజరైన పార్టీ శ్రేణులు

డిప్యూటీ మేయర్ ఎన్నికలో కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి హింసించిన ఘటనలను ఎప్పటికీ మరువమని, అంతకంత బదులు తీర్చుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడు నెలల నుంచి ఏ నెలలోనూ ఒకటో తేదీన వేతన అందక ఎస్వీయూ ఉద్యోగులు కుటుంబ పోషణకు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. గతంలో ఎప్పుడూ ఇలాంటి దుర్భర పరిస్థితులను ఎదుర్కోలేదు. విసిగి వేసారిన ఉద్యోగులు ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించడంతో ఎట్టకేలకు వర్సిటీ అధికారుల్లో చలనం వచ్చింది. జనవరి వేతనాలు, పెన్షన్లు ఫిబ్రవరి 19న విడుదల చేశారు. ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేయడంలో జాప్యమే ఇందుకు కారణమని పేర్కొన్నారు.

- ఏడు నెలలుగా వేతన వెతలే...!
- ఏ నెలలోనూ ఒకటో తేదీన ఇవ్వని జీతాలు
- అప్పుల పాలవుతున్నా పట్టించుకోని అధికారులు
- ఎస్వీయూలో శాశ్వత ఉద్యోగులు, పెన్షనర్ల ఆవేదన
- ఎట్టకేలకు బుధవారం జీతాలు జమ

తిరుపతి సిటీ: శాశ్వత ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఆచరణలో చేతులెత్తేసింది. వర్సిటీలో గత ఏడు నెలలుగా ఏ రోజూ సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో హామీలు ఇచ్చి ఇప్పుడు కడుపు కొడుతోందని ప్రభుత్వం తీరుపై ఉద్యోగులు మండిపడుతున్నారు. మరోవైపు ఎస్వీయూ ఉద్యోగులు గురువారం నుంచి పోరుబాటకు సన్నద్ధం కావడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ప్రభుత్వం నుంచి గ్రాంట్ రూ.37కోట్ల కోసం ఎదురుచూసినా స్పందన రాకపోవడంతో సర్దుబాటు చర్యలకు పూనుకున్నారు. వర్సిటీ డెవలప్‌మెంట్ నిధుల నుంచి జీతాలు ఉద్యోగుల, పెన్షనర్ల ఖాతాలో బుధవారం జమచేశారు. మరోవైపు వేతనాల జాప్యం వల్ల కుటుంబ పోషణకు ఇబ్బందులు పడడంతోపాటు ఈఎంఐలు, క్రెడిట్ కార్డుల చెల్లింపు, లోన్ బకాయిలు, ఇంటి అద్దె, స్కూల్ ఫీజులు..మొదలైనవి చెల్లించేందుకు అవస్థలు పడుతున్నామని ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.

ఎస్వీయూలో ఉద్యోగుల వివరాలు

టీచింగ్ స్టాఫ్		నాన్ టీచింగ్ స్టాఫ్	
రెగ్యులర్ అధ్యాపకులు	148	రెగ్యులర్ ఉద్యోగులు	449
అకడమిక్ కన్సల్టెంట్లు	263	ఎన్ఎమ్ఆర్‌లు	627
గెస్ట్ ఫ్యాకల్టీ	21	టైమ్ స్కేల్	613
		ఔట్‌సోర్సింగ్	123

ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒక నెల జీతాలకు అవసరమైన మొత్తం 18.50కోట్లు





సక్రమంగా జీతాలు చెల్లించాలని కోరుతున్న నాన్ టీచింగ్ అసోసియేషన్ సభ్యులు

గత ఏడు నెలలుగా జీతాల చెల్లింపులు ఇలా...

మాసం	చెల్లించాల్సిన తేదీ	చెల్లించిన తేదీ
జూలై	ఆగష్టు 1	ఆగష్టు 20
ఆగష్టు	సెప్టెంబర్ 1	సెప్టెంబర్ 6
సెప్టెంబర్	అక్టోబర్ 1	అక్టోబర్ 3
అక్టోబర్	నవంబర్ 1	-----
నవంబర్	డిసెంబర్ 1	డిసెంబర్ 6 (రెండు నెలలు జీతం)
డిసెంబర్	జనవరి 1	జనవరి 9
జనవరి	ఫిబ్రవరి 1	ఫిబ్రవరి 19

ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటం



వర్సిటీలో నాన్ టీచింగ్ ఎంప్లాయిస్‌కు ఏడు మాసాలుగా జీతాలు సక్రమంగా అందక అప్పులపాలవుతున్నారు. వర్సిటీ అధికారులకు సమస్యను పలుమార్లు వివరించాం. ఇక నుంచి ప్రతి నెలా ఒకటి, రెండు తేదీలలో జీతాలు చెల్లించాల్సిందే. ఉద్యోగుల సంక్షేమం కోసం మేం పోరాటం చేస్తాం.

–గుర్రంకొండ శ్రీధర్, అధ్యక్షులు, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎస్వీయూ

ఏడునెలలుగా ఇబ్బందులే



నాన్ టీచింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి 4 విడతలుగా 2024 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి 2025 వేతనాల కోసం రూ.226.38కోట్ల గ్రాంట్ మంజూరైంది. ఇది కేవల 10 నెలల జీతాలకు సరిపోతుంది. గ్రాంట్ ఆలస్యం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

ఎస్ సుబ్రమణ్యం, సెక్రటరీ, నాన్‌టీచింగ్ అసోసియేషన్, ఎస్వీయూ

పెనాల్టీ కడుతున్నారు



జీతాలు సరైన టైమ్‌కు రాకపోవడంతో ఈఎమ్‌ఐలు, క్రెడిట్ కార్డులు, ఇంటి అద్దెలు కట్టలేక పెనాల్టీ చెల్లిస్తున్నారు. క్రెడిట్ స్కోర్ భారీగా పడిపోవడంతో బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితి ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా క్రమం తప్పకుండా జీతాలు ఇస్తే మంచిది.

– కె.మురళి, ఉపాధ్యక్షులు, నాన్‌టీచింగ్ అసోసియేషన్, ఎస్వీయూ

ప్రభుత్వం స్పందించకపోతే పరిస్థితి దారుణం



ప్రతి నెలా ఒకటో తేదీ జీతాలు పడకపోతే ఉద్యోగులు బాధలు చెప్పనలవి కాదు. క్రెడిట్ పేమెంట్లు, ఈఎంఐలు మెసేజ్‌లతోపాటు ఇంటి అద్దె చెల్లింపు, నిత్యావసరాలకు డబ్బు సమస్య నిద్ర పట్టనీదు. అప్పులు చేయాల్సిందే. ఇది వర్సిటీలో సాధారణ ఉద్యోగులు ఏడు నెలలుగా పడుతున్న అవస్థలు అవస్థలు.

–ఆర్ ముత్తువేలు, జాయింట్ సెక్రటరీ, నాన్‌టీచింగ్ అసోసియేషన్, ఎస్వీయూ

పెన్షనర్ల పరిస్థితి మరీ ఘోరం



ఎస్వీయూ రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. గత ఏడు నెలలుగా ఒకటో తేదీన పెన్షన్లు అందుతాయనే నమ్మకం లేకుండా పోయింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి నెల నిర్దేశిత తేదీకే పెన్షనర్లకు పెన్షన్ ఇవ్వాలి.

–జి విజయ్‌కుమార్, సెక్రటరీ, నాన్‌టీచింగ్ పెన్షనర్ల అసోసియేషన్, ఎస్వీయూ

పీజీ పరీక్షల ఫలితాలు విడుదల చేయరూ!



వీసీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఏడు నెలల క్రితం నిర్వహించిన పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు ఇంతవరకు విడుదల చేయకపోవడం శోచనీయమని, ఇకనైనా జాప్యం చేయకుండా విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు వీసీ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న తొలి, మూడవ సెమిస్టర్ ఫలితాలు సైతం వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, వినోద్, నాయకులు మధు, సాయి, జగదీష్, సాయి, సతీష్, హాసిని పాల్గొన్నారు.

ఆలయాల సందర్శనలో మంత్రి సుభాష్

తిరుపతి రూరల్/తిరుమల: తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరంలోని పురాతన ఆలయం శ్రీకామాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామిని, తిరుమల శ్రీవారిని బుధవారం రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. యోగిమల్లవరంలో స్వామి వారికి నిర్వహించిన అభిషేకంలో పాల్గొన్న అనంతరం మంత్రి 48 నేతి దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు. ఆయా ఆలయాల్లో వేదపండితులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలి



ఎం.కొంగరవారిపల్లె సమీపంలోని జగనన్న కాలనీలో పర్యటిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

చంద్రగిరి: కూటమి ప్రభుత్వం పేదలకు 2సెంట్ల స్థలం మంజూరు చేయడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని కొంగరవారిపల్లెలో జగనన్న కాలనీని సీపీఐ బృందంతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాల సమస్యలను ప్రస్తుత గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్తామన్నారు. తిరుపతి నగర పేదలకు 25 కిలోమీటర్ల దూరంలో ఇక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పడుతున్న ఇబ్బందులను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి ప్రస్తావించారు. తిరుపతి జిల్లా కమ్యూనిస్టు పార్టీ ప్రస్తుత ప్రభుత్వం రెండు సెంట్లు మంజూరు చేసేంతవరకు పోరాటం చేస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, ప్రభాకర్, విశ్వనాథ్, బండి చలపతి, రవి, రామకృష్ణ, కేవై రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివజయంతి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో ఛత్రపతి శివాజి మహారాజ్ శివజయంతి మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోవింద దేవగిరి మహారాజ్, ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, డీన్ డాక్టర్ దక్షిణమూర్తి శర్మ, రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, గణపతి భట్ పాల్గొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను పద్మావతి మహిళా వర్సిటీలో కలిశారు.

వేడుకగా కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో వేడుకగా ప్రారంభమయ్యాయి. పంచ మూర్తులైన శ్రీస్కోమ స్కంధమూర్తి, శ్రీకామాక్షి, శ్రీవినాయకస్వామి, శ్రీచండీకేశ్వర స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో ఉదయం 5.20 గంటలకు ఈ కార్యక్రమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఏడాదికొకసారి ధ్వజస్తంభానికి విశేష అభిషేకం

ధ్వజారోహణంలో భాగంగా మొదట ధ్వజపటం అధిరోహణ తర్వాత ధ్వజస్తంభానికి అభిషేకం, బలి, నివేదన, దీపారాధన, ఉపచారాలు, ధ్వజస్తంభానికి విశేష అభిషేకాలు, వేదపారాయణం ఇత్యాది కార్యక్రమాలను కంకణభట్టర్ స్వామినాథ గురుకుల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం శ్రీసోమస్కంధమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారికి పల్లకీ ఉత్సవం వేడుకగా నిర్వహించారు. స్వామి, అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు ఉదయ గురుకుల్, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



హంస వాహనంపై శ్రీకపిలేశ్వరస్వామి



పల్లకిలో ఊరేగుతున్న స్వామి అమ్మవారు

హంస వాహనంపై శ్రీకపిలేశ్వరస్వామి

వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి స్వామివారు హంస వాహనాన్ని అధిరోహించి భక్తులను కటాక్షించారు. కళాబృందాల భజనలు, కోలాటాల నడుమ వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు నీరాజనాలు సమర్పించారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ఆధ్యాత్మిక, సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

తిరుపతి తుడా: తుడా పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. తుడా అధికారులతో మంత్రి నారాయణ విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో సమీక్షించారు. పురపాలక శాఖ కమిషనర్, డైరెక్టర్ సంపత్ కుమార్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, తుడా వైస్ చైర్మన్ మౌర్య, పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ విద్యుల్లత తదితరులు హాజరయ్యారు. తుడా ఆదాయం పెంపునకు అవసరమైతే పీపీపీ విధానంలో భూములను అభివృద్ధి చేసి విక్రయించాలన్నారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో లేఔట్లలో హౌసింగ్ ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. మరోవైపు తుడా పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను విడుదల చేయాలని ఆదేశించారు. తిరుపతిలో 3.61ఎకరాల్లో జీ+ 13 అంతస్తుల్లో నిర్మిస్తున్న తుడా టవర్ల పనుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుడా టవర్ల బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

